## ప్రజాజ్యోతి తెలుగు జాతీయ పత్రికకు విలేకరులు కావలెను

* కామారెడ్డి జిల్లా వ్యాప్తంగా వార్తల్లో ముందుకు దూసుకుపోతున్న ప్రజాజ్యోతి దినపత్రిక కు వివిధ మండలాలకు రిపోర్టర్లు కావలెను
* బాన్సువాడ టౌన్, కామారెడ్డి టౌన్, కామారెడ్డి ఆర్సి, బిచ్కుంద, బీర్కూర్, తాడ్వాయి, లింగంపేట, నస్రుల్లాబాద్, మండలాలకు రిపోర్టర్లు కావలెను
* కనీస విద్యార్హత ఉంటే సరిపోతుంది. మిగతా వివరాలకు

ఈ క్రింది నెంబర్ ను సంప్రదించండి.

**96665 56646**





# ప్రజాజ్యోతి

నిజామాబాద్ కామారెడ్డి

శుక్రవారం 28-11-2025 | పేజీలు : 9



4లో

## ప్రభుత్వాలు మారిన

# రైతుల బాధలు తీరేనా..

- తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత
- రైతులకు న్యాయం చేయాలని డిమాండ్
- నాగమడుగు లెఫ్ట్ ఇరిగేషన్ పనులు వేగవంతం చేయాలి
- ఇప్పుడున్న ప్రభుత్వం అప్పుడున్న ప్రభుత్వం పద్ధతి లేకుండా కట్టడం

## గ్రామ పంచాయతీ ఎన్నికల నామినేషన్ కేంద్రాలను

# జిల్లా ఎస్పీ ఆకస్మిక పరిశీలన


2లో

* స్థానిక సంస్థలకు ఎన్నికల దృష్ట్యా జిల్లాలో పకడ్బందీ బందోబస్తు ఏర్పాటు
* జిల్లా ఎస్పీ యం. రాజేష్ చంద్ర


5లో

# పల్లెలో బార్లను తలపిస్తున్న బెల్టు షాపులు

* వైన్ షాపుల్లో ఉండే బ్రాండ్లు, బెల్ట్ షాపుల్లో లభ్యం
* అధిక ధరలకు విక్రయాలు
* ఒకవైపు కల్లు.. మరోవైపు బెల్ట్ షాపులతో జనాలు బెంబేలు
* ఎక్సైజ్ శాఖ అధికారుల కనుసన్నల్లోనే....?
* కల్తీ కల్లు,బెల్ట్'పై కొరవడిన నిఘా..!
* ప్రజా జ్యోతి ప్రత్యేక కథనం....



## వరి కొనుగోలు కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్

* **ఆశిష్ సాంగ్వాన్**

కామారెడ్డి ప్రతినిధి, నవంబర్ 27 (ప్రజాజ్యోతి) : మాచారెడ్డి మండలం, సోమవారం పేట్ గ్రామ పంచాయితీ పరిధి లోని నెమలి గుట్ట తాండాలో వరి కొనుగోలు కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ గురువారం ఆకస్మికంగా సందర్శించి తనిఖీ చేశారు. తనిఖీ సందర్భంగా కలెక్టర్ కొనుగోలు కేంద్రంలో వరి స్వీకరణ విధానం, తూకాల యంత్రాలు, నిల్వ సౌకర్యాలు, రైతులకు అందిస్తున్న సేవలు, బిల్లుల జారీ, లోడింగ్ వంటి అంశాలను సమీక్షించారు. కొనుగోలు ప్రక్రియలో పారదర్శకత పాటించాలని రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని అధికారులకు సూచించారు. రైతుల సమస్యలను కలెక్టర్ నేరుగా తెలుసుకొని, వెంటనే పరిష్కారం కోసం సంబంధిత శాఖాధికారులకు ఆదేశాలు జారీ చేశారు. వరి కొనుగోలు కేంద్రాల పనితీరుపై నిరంతరంగా పర్యవేక్షణ కొనసాగుతుందని కలెక్టర్ పేర్కొన్నారు. తనిఖీలో గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి సురేందర్, సివిల్ సప్లై అధికారి వెంకటేశ్వర్లు,డీఎమ్ శ్రీకాంత్,తహసిల్దార్ సరళ, ఎంపీడీవో శ్రీనివాస్,సిబ్బంది తదితరులు పాల్గొన్నారు..

# గ్రామ పంచాయతీ ఎన్నికల నామినేషన్ కేంద్రాలను జిల్లా ఎస్పీ ఆకస్మిక పరిశీలన

* **స్థానిక సంస్థలకు ఎన్నికల దృష్ట్యా జిల్లాలో పకడ్బందీ బందోబస్తు ఏర్పాటు**
* **జిల్లా ఎస్పి యం. రాజేష్ చంద్ర**



కామారెడ్డి ప్రతినిధి నవంబర్ 27. (ప్రజాజ్యోతి) : గ్రామపంచాయతీ ఎన్నికల నామినేషన్ల దృష్ట్యా రామారెడ్డి మండలంలోని రామారెడ్డి, పోసానిపేట్ గ్రామపంచాయతీలు మరియు మాచారెడ్డి పోలీస్ స్టేషన్ పరిధిలోని మాచారెడ్డి గ్రామపంచాయతీలో ఏర్పాటు చేసిన నామినేషన్ మరియు పోలింగ్ కేంద్రాలను జిల్లా ఎస్పీ యం.రాజేష్ చంద్ర,శుక్రవారం ఆకస్మికంగా పరిశీలించారు. పరిశీలన సందర్భంగా నామినేషన్ కేంద్రాల్లో విధుల్లో ఉన్న పోలీస్ సిబ్బందితో ఎస్పీ ప్రత్యేకంగా మాట్లాడి,ఎన్నికల నియమావళి ప్రకారం నామినేషన్ ప్రక్రియ పూర్తిగా నిష్పక్షపాతంగా, శాంతియుతంగా జరుగేలా పనిచేయాలని పలు సూచనలు చేశారు. ఎలాంటి అవాంఛిత పరిస్థితులు తలెత్తకుండా అప్రమత్తంగా ఉండాలని, ప్రజలకు పారదర్శకమైన వాతావరణం కల్పించాల్సిన బాధ్యత ప్రతి సిబ్బందిపైన ఉందని పేర్కొన్నారు. జిల్లా ఎస్పీ ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్నికలలో శాంతిభద్రతలను కాపాడటంలో ఎలాంటి రాజీ ఉండదు. ఎన్నికల ప్రక్రియను భంగపరచాలని చూస్తే కఠిన చట్టపరమైన చర్యలు తప్పవు." అని స్పష్టం చేశారు. జిల్లాలోని సెన్సిటివ్ గ్రామాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి, ప్రతి పోలింగ్ కేంద్రంలో పకడ్బందీ బందోబస్తు, పేట్రోలింగ్, క్విక్ రెస్పాన్స్ టీంలను సిద్ధంగా ఉంచినట్లు ఎస్పీ తెలిపారు. అక్రమ డబ్బు, మద్యం పంపిణీ, బెదిరింపులు, అనైతిక ప్రలోభాలు వంటి తప్పిదాలు ఎక్కడైనా గమనిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ ఆకస్మిక పరిశీలనలో కామారెడ్డి ఏఎస్పీ బి. చైతన్య రెడ్డి, సంబంధిత ఎస్సైలు మరియు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



## సర్పంచ్ అభ్యర్థిగా మొదటి నామినేషన్

రామారెడ్డి నవంబర్ 27 (ప్రజా జ్యోతి) : రామారెడ్డి గ్రామ సర్పంచ్ గా మొదటి రోజు నామినేషన్ దాఖలు చేయడం జరిగినది. గతంలో శైలజ శ్రీనివాస్ గుప్తా సర్పంచ్ గా అందరి ఆశీర్వాదంతో భారీ మెజారిటీతో గెలిపించడం జరిగినది. అదే స్ఫూర్తితో పడిగ శ్రీనివాస్ అను నేను సర్పంచ్ గా పోటీ చేస్తున్న అదేవిధంగా రామారెడ్డి గ్రామ ప్రజలు నన్ను ఆశీర్వదించి గెలిపించాలని హృదయపూర్వకంగా ప్రజలను కోరారు. మీ రత్నాకర్ తనయుడు మాట తప్పకుండ మీకు మీ అందరికీ అందుబాటులో ఉంటూ సేవ చేసే భాగ్యాన్ని రామారెడ్డి గ్రామ ప్రజలు మనస్ఫూర్తిగా ఆశీర్వదించి గెలిపించాలని అభ్యర్థించారు.

# విద్యార్థులకు నోట్ బుక్స్ అందజేత

* **జిల్లా పాలనాధికారి ఆశిష్ సాంగ్వాన్.**



కామారెడ్డి ప్రతినిధి, నవంబర్ 27 (ప్రజాజ్యోతి) : మాచారెడ్డి మండలం సోమార్ పేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ గురువారం ఆకస్మికంగా సందర్శించి తనిఖీ చేశారు. పాఠశాల ప్రాంగణంలో పరిశుభ్రత పరిస్థితులను పరిశీలించిన కలెక్టర్ ఆవరణలో ఎక్కడా చెత్త కనిపించకుండా శుభ్రత పై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని పాఠశాల యాజమాన్యానికి సూచించారు. తరువాత పదవ తరగతి క్లాస్‌రూమ్ కి వెళ్లి విద్యార్థుల హాజరు శాతాన్ని పరిశీలించారు. విద్యార్థులతో పరస్పర సంభాషణ జరిపిన కలెక్టర్ పదవ తరగతి ఉత్తీర్ణత శాతం పెరగాలంటే ప్రతి విద్యార్థి క్రమశిక్షణతో చదువుకోవాలని, టీచర్లు అందిస్తున్న మార్గదర్శకాలను పూర్తిగా వినియోగించుకోవాలని ప్రోత్సహించారు. విద్యార్థుల విద్యాభ్యాసాన్ని మరింత మెరుగుపరచడానికి వారికి నోట్ బుక్స్ ను స్వయంగా విద్యార్థులకు అందించి,పట్టుదలతో చదివి మంచి ర్యాంకులు సాధించాలని ఆకాంక్షించారు. తదుపరి విద్యార్థులతో ఆత్మీయంగా మాట్లాడిన కలెక్టర్ తమకు ఇష్టమైన సబ్జెక్ట్ ఏమిటి? ఎందుకు ఇష్టం? అని అడిగి, విద్యార్థులు చెప్పిన విషయాలను ఆసక్తిగా విన్నారు. ఆ సబ్జెక్ట్ గురించి విద్యార్థుల మాటల్లో వచ్చిన వివరాలను విని ఆనందం వ్యక్తం చేశారు. విద్యార్థుల అధ్యయన ఆసక్తిని అభినందించి ప్రతీ విద్యార్థికి నోట్‌బుక్స్ ను స్వయంగా అందజేశారు. మెనూ ప్రకారం భోజన వివరాలను అడిగి తెలుసుకున్నారు. జిల్లాలో విద్యా ప్రమాణాలు మెరుగుపరిచేందుకు ప్రభుత్వం చేపట్టిన చర్యలను పకడ్బందీగా నిర్వహించాలని, ఫలితాలు మెరుగుపడేల కృషి చేయాలని తెలిపారు. తనిఖీలో విద్యాశాఖ అధికారి రాజు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు , తహసిల్దార్, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

## మండల కేంద్రంలో మొదటి రోజు నామినేషన్లు

* **ఎంపీడీవో నాగేశ్వరరావు**



రామారెడ్డి నవంబర్ 27 (ప్రజా జ్యోతి) : రామారెడ్డి మండల కేంద్రంలో సాధారణ గ్రామపంచాయతీ ఎన్నికలు 2025 లో భాగంగా సర్పంచ్ పదవికి అభ్యర్థులు మండల వ్యాప్తంగా ఆయా గ్రామాలలో 15 నామినేషన్లను మొదటి రోజు అందజేయడం జరిగింది. అదేవిధంగా ఆయా గ్రామాలకు సంబంధించిన వార్డు మెంబర్లు 14 నామినేషన్లు స్వీకరించడం జరిగింది అని స్థానిక ఎంపీడీవో నాగేశ్వరరావు తెలిపారు.



## వెంకటాపూర్ లో దుప్ సింగ్ కుటుంబా నికి మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్ పరామర్శ

గాంధారి, నవంబర్ 27 (ప్రజాజ్యోతి) : గాంధారి మండలంలోని వెంకటాపూర్ గ్రామానికి చెందిన ఆర్టిఒ అధికారిగా పనిచేస్తున్న కేతావత్ దూప్ సింగ్ తండ్రి కేతావత్ గోవింద్ అనారోగ్యంతో నాలుగు రోజుల క్రితం మృతిచెందిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో నేడు వారి ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించిన ఎల్లారెడ్డి మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్ బాధితులకు మనోధైర్యం నింపారు. దీంతో పాటు మృతుని సేవలను స్మరించుకుంటూ కుటుంబానికి అన్ని విధాలా అండగా ఉంటామని మాజీ ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో బి ఆర్ ఎస్ మాజీ జెడ్పిటిసి హరలే తానాజీ రావు, మాజీ ఎంపిపి రాదా బలరాం, మండల బీఆర్ఎస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, పార్టీ కార్యకర్తలు మరియు స్థానిక గ్రామస్తులు పాల్గొన్నారు.



## జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక

రామారెడ్డి నవంబర్ 27 (ప్రజా జ్యోతి) : ఇంగ్లీష్ లాంగ్వేజ్ టీచర్స్ అసోసియేషన్ వారి ఆద్వర్యంలో తెలంగాణ ఇంగ్లీష్ ఒలంపియాడ్ మండల స్థాయి పోటీలలో జూనియర్స్,సీనియర్స్ విభాగంలో గిద్ద పాఠశాల విధ్యార్థులు శ్రుజన, సాహిత్, ప్రదీప్తి విజేతలుగా నిలిచి జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక కావడం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల విధ్యాదికారి ఆనంద్ రావ్, పాఠశాల హెడ్మాస్టర్ వేణుమాధవ్, విష్ణువర్ధన్, మండలంలోని అన్ని స్కూల్స్ ఇంగ్లీష్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు. గిద్ద పాఠశాల నుండి ముగ్గురు ఎంపికై నందున గిద్ద పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కన్నయ్య మరియు ఉపాధ్యాయులు గ్రామస్థులు వీరిని అభినందించడం జరిగింది.

## సిద్ధ రామేశ్వర ఆలయ హుండీ లెక్కింపు




భిక్కనూరు, నవంబర్ 27 (ప్రజాజ్యోతి) : భిక్కనూరు మండల కేంద్రంలోని శ్రీ సిద్ధ రామేశ్వర ఆలయ హుండీ లెక్కింపు గురువారం రోజు ఆలయ ప్రాంగణంలో దేవదాయ శాఖ ఇన్స్పెక్టర్ కమల ఆధ్వర్యంలో లెక్కించారు.కార్తీక మాసం మొత్తం ఆదాయం 7,22,503 రూపాయలు వచ్చినట్లు ఆలయ కార్యనిర్వహణ అధికారి పద్మ శ్రీధర్ తెలిపారు.ఈ కార్యక్రమంలో ఆలయ పునర్నిర్మాణ కమిటీ చైర్మన్ లింబాద్రి, పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.

# బిఆర్ఎస్ లోకి భారీ చేరికలు



నిజాంసాగర్, ప్రజా జ్యోతి, నవంబర్ 27 : జుక్కల్ నియోజకవర్గంలోని నిజాంసాగర్ మండలం అచ్చంపేట గ్రామానికి చెందిన 50 మంది కాంగ్రెస్ పార్టీకి చెందిన నాయకులు గురువారం మాజీ ఎమ్మెల్యే హన్మంత్ షిండే సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. వీరికి హన్మంత్ షిండే గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చడంలో విఫలమైందన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో టిఆర్ఎస్ పార్టీ అభ్యర్థులను గెలిపించాలని కార్యకర్తలను కోరారు. కెసిఆర్ హయాంలో ప్రవేశపెట్టిన అనేక ప్రజా సంక్షేమ పథకాలు యువతకు దేశానికి దిక్సూచిగా మారాయని అన్నారు. టిఆర్ఎస్ లో చేరిన ప్రతీ కార్యకర్త కుటుంబానికి గులాబీ పార్టీ అండగా నిలుస్తుంది భరోసా ఇచ్చారు.

# పల్లెల్లో సర్పంచ్ ఎన్నికల సందడి



సదాశివనగర్, నవంబర్ 27 (ప్రజాజ్యోతి) : సదాశివనగర్ మండలంలో సర్పంచ్ ఎన్నికల నోటిఫికేషన్ వేళ గ్రామాలన్నీ రాజకీయ వాతావరణంతో కిక్కిరిసిపోతున్నాయి. పల్లెల్లో ఒక్కసారిగా సందడి పెరిగి, ఆశావాహుల పరుగు మొదలైంది. ప్రతి గ్రామంలో సభలు, మాటామంతీలు, ఇంటింటి పర్యటనలు చురుగ్గా సాగుతున్నాయి.

* **ఆశావాహుల గురి – గ్రామాభివృద్ధి, సేవలే అజెండా**

సర్పంచ్ పదవిపై ఆసక్తి చూపుతున్న ఆశావాహులు ప్రజల సమస్యలు తెలుసుకోవడానికి గ్రామాల్లో పర్యటిస్తుండగా, గ్రామాభివృద్ధి, తాగునీరు, రోడ్లు, పారిశుద్ధ్యం వంటి అంశాలను తమ ప్రధాన అజెండాగా ప్రకటిస్తున్నారు. యువతలో కూడ పురోగామి అభ్యర్థులను గెలిపించాలని ఉత్సాహం కనిపిస్తోంది. మండలంలోని గ్రామాల్లో గ్రామాల్లో రాజకీయ చర్చలు వేడెక్కుతున్నాయి. పాత నాయకులు మళ్లీ బరిలో దిగేందుకు సిద్ధమవుతుండగా, కొత్త ముఖాలు కూడా స్థానిక ప్రజల్లో నమ్మకం పెంపొందించుకునే పనిలో ఉన్నారు.

* **ఇంటింటి ప్రచారానికి శుభారంభం**

ప్రజా సమస్యలను పరిష్కరిస్తామని హామీలతో అభ్యర్థులు ఓటర్లను కలుస్తున్నారు. మహిళా ఓటర్లను ఆకర్షించేందుకు ప్రత్యేక పథకాల హామీలు, యువ ఓటర్లను ఆకట్టుకునేందుకు డిజిటల్ ప్రచారం కూడా కనిపిస్తోంది. ప్రజల్లో రాజకీయ చైతన్యం పెరుగుతోంది. ఈసారి గ్రామ పంచాయతీ ఎన్నికల్లో అభివృద్ధి, పారదర్శక పాలన, గ్రామ సేవల బలోపేతమే ప్రధాన చర్చాంశాలుగా మారాయి. ప్రజలు కూడా సమర్థుడైన నాయకుడిని ఎన్నుకోవాలని భావిస్తున్నారు.



# నామినేషన్ కేంద్రాలను పరిశీలించిన ఎంపీడీవో

సదాశివనగర్, నవంబర్ 27 (ప్రజాజ్యోతి) : సదాశివనగర్ మండలంలోని ఉత్తునూర్, యాచారం గ్రామాలలో నామినేషన్ కేంద్రాలను ఎంపీడీవో సంతోష్ కుమార్ పరిశీలించారు. అధికారులు చేపట్టిన ఏర్పాట్లు, భద్రతా చర్యలు, అభ్యర్థులకు ఇచ్చే సౌకర్యాలను ఖచ్చితంగా పరిశీలిస్తూ సంబంధిత సిబ్బందికి సూచనలు జారీ చేశారు. ఎన్నికల ప్రక్రియ పారదర్శకంగా, ప్రశాంతంగా సాగేందుకు అవసరమైన అన్ని చర్యలను తీసుకోవాలని ఎంపీడీవో సూచించారు. నామినేషన్ కేంద్రాల్లో సదుపాయాలు, పోలీసు బందోబస్తు లాంటి అంశాలను ఆరా తీసి లోపాలు కనిపించిన చోట వెంటనే సరిచేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఎన్నికల షెడ్యూల్ ప్రకారం నామినేషన్ల స్వీకరణ సజావుగా కొనసాగలని ప్రజలు, అభ్యర్థులు నియమ నిబంధనలు పాటించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఎలక్షన్ రిటర్నింగ్ ఆఫీసర్లు, పంచాయతీ కార్యదర్శి రాహుల్ గౌడ్, ఫీల్డ్ అసిస్టెంట్ నర్సగౌడ్, పోలీస్ సిబ్బంది తదితరులు ఉన్నారు.



## కొండాపూర్ శివారులో బైక్‌లు ఢీకొని వ్యక్తి మృతి

రాజంపేట నవంబర్ 27 (ప్రజా జ్యోతి) : రాజంపేట మండలం కొండాపూర్ గ్రామ శివారులో గురువారం రాత్రి జరిగిన దారుణ రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన స్థానికంగా విషాదాన్ని మిగిల్చింది. ఎస్సై రాజు తెలిపిన వివరాల ప్రకారం—గుడి తండాకు చెందిన మెగావత్ ఫన్నీ (40) ఎల్లారెడ్డిపల్లి నుంచి స్వగ్రామానికి వెళ్తుండగా, కొండాపూర్ వద్ద ఎదురుగా వచ్చిన పల్సర్ బైక్ అతివేగంగా, అజాగ్రత్తగా ఫన్నీ బైక్‌ను ఢీకొట్టింది. ఘటనా స్థలంలోనే ఫన్నీ తీవ్రంగా గాయపడి, స్థానికుల సహాయంతో వెంటనే కామారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, వైద్యులు ఆయనను పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు ప్రకటించారు. ఈ ఘటనపై మృతుని భార్య సౌమ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుగుతోందని రాజంపేట ఎస్సై రాజు తెలిపారు.



## ఉద్యమకారులకు ఇచ్చిన హామీని ప్రభుత్వం నెరవేర్చాలి..

* **తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత**

బాన్సువాడ ఆర్ సి, నవంబర్ 27 (ప్రజా జ్యోతి) : కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్యమకారులకు 250 గజాల స్థలం ఇస్తానని చెప్పి మోసం చేస్తున్నారని, ఇచ్చిన మాటకు కట్టుబడి హామీలు నెరవేర్చాలని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. జాగృతి జనం



బాటలో భాగంగా బాన్సువాడ మండలం కొయ్యగుట్ట అమరవీరుల స్తూపం వద్ద ఉద్యమకారుల ఫోరం ఆధ్వర్యంలో అమరవీరులకు నివాళులర్పించారు. అనంతరం కొయ్యగుట్ట సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల సందర్శించి విద్యార్థినిలతో ముచ్చటించారు. ఉద్యమకారులకు పింఛన్, గుర్తింపు కార్డులు ఇచ్చేవరకు పోరాటం చేస్తామని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమకారులకు ఇంటి స్థలాలు ఇవ్వకపోతే మరో ఉద్యమం చేస్తామని హెచ్చరించారు. ప్రభుత్వం హాస్టల్ విద్యార్థులకు పెండింగ్ కాస్మెటిక్ చార్జీలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఇటీవల చందూర్ మైనార్టీ గురుకుల పాఠశాలలో పదో తరగతి విద్యార్థి మృతి పట్ల ప్రభుత్వం పారదర్శకంగా విచారణ చేపట్టాలని కోరారు.

## బోనస్ కాదు... బోగస్ మాటల పార్టీ కాంగ్రెస్

* **ఎకరాకు రూ.25వేలు నష్టపరిహారం చెల్లించాలి**

తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత



నాగిరెడ్డిపేట్, నవంబర్27 (ప్రజాజ్యోతి): బోనస్ కాదు... బోగస్ మాటల పార్టీ కాంగ్రెస్ అని,అకాల వర్షాలతో పంట నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ. 25వేలు నష్ట పరిహారం తక్షణమే అందించాలని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు..గురువారం జాగృతి జనం బాట కార్యక్రమంలో భాగంగా నాగిరెడ్డిపేట్ మండలంలోని బంజారా వద్ద ముంపు రైతులతో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అకాల వర్షాలతో మండలంలో సుమారు 6వేల ఎకరాల్లో పంట నష్టం వాటిల్లిందని,జిల్లాలో స్వయంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పర్యటించిన పంట నష్టపోయిన రైతులకు పరిహారం అందిస్తామని హామీ ఇచ్చిన ఇప్పటివరకు నయాపైసాను కూడా కాంగ్రెస్ ప్రభుత్వం చెల్లించలేదని, రైతులకు వరిధాన్యం బోనస్ అందిస్తామని బోగస్ మాటలు చెప్పి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందని,ఎన్నికల్లో ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలనీ డిమాండ్ చేశారు.మండలంలో మంజీరా నది వరద ఉధృతి వలన 15గ్రామాల్లో నష్టపోయిన రైతులకు ఎకరాకు 25వేల పరిహారం అందించాలని డిమాండ్ చేశారు.లేదంటే కలెక్టర్ ఎదుట ధర్నా నిర్వహిస్తామని డిమాండ్ చేశారు. మండలంలోని మాల్తుమ్మెద గ్రామశివారులో విత్తన క్షేత్రంకు అనుకోని ఉన్న సుమారు 800 ఎకరాల్లో విత్తన పరిశోధన కేంద్రం ఏర్పాటు చేసి యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. భారీ వర్షాలతో ట్రాన్స్ఫార్మర్లు విద్యుత్ స్తంభాలు నేలకొరిగిన మరమ్మతులు చేయకపోవడం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనమని ఆమె మండిపడ్డారు.ఈ కార్యక్రమంలో జాగృతి జిల్లా అధ్యక్షుడు సంపత్ గౌడ్,రాష్ట్ర మహిళా ప్రధాన కార్యదర్శి బాజ లలితా,జాగృతి నాగిరెడ్డిపేట మండల యూత్ అధ్యక్షుడు చరణ్,ఎస్సి సెల్ అధ్యక్షుడు ఎల్లమొల్ల శ్రీను,మైనారిటీ మండల అధ్యక్షుడు జాకిర్,మండల మహిళా అధ్యక్షురాలు మ్యాకల పద్మ,గోపాల్ గ్రామా అధ్యక్షడు రాజిపేట సిద్ధిరాములు జాగృతి నాయకుడు బాగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వాలు మారిన రైతుల బాధలు తీరేనా..

* **తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత**
* **రైతులకు న్యాయం చేయాలని డిమాండ్**
* **నాగమడుగు లెఫ్ట్ ఇరిగేషన్ పనులు వేగవంతం చేయాలి**
* **ఇప్పుడున్న ప్రభుత్వం అప్పుడున్న ప్రభుత్వం పద్ధతి లేకుండా కట్టడం**



నిజాంసాగర్, ప్రజాజ్యోతి, నవంబర్ 27 : తెలంగాణ రాష్ట్ర జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత కామారెడ్డి జిల్లా నిజాంసాగర్ మండలంలో పర్యటించారు. నర్సింగ్ రావు పల్లి చౌరస్తా వద్ద నాయకులు ఆమెను సన్మానించి పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. వడ్డేపల్లి శివారులోని నాగమడుగు లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టును సందర్శించారు. ఆమె వెంట ఉన్న రైతులు ప్రాజెక్టు కట్టడాలపై వారికి ఎదురవుతున్న నష్టాలను విన్నవించారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడారు.. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో జుక్కల్ నియోజకవర్గం తక్కువగా సాగు నీరు అందించే వ్యవస్థ ఉందని, మంజీరా నీళ్లతో నాగమడుగు లిఫ్ట్ ఇరిగేషన్ కట్టి 40 వేల ఎకరాలకు మీరు అందిద్దామని కడుతున్న నాగమడుగు లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టును కడుతున్నారని గుర్తు చేశారు. కానీ నిర్మాణానికి కావలసిన 200 ఎకరాల ఒక గింజ కూడా సేకరించలేదని విమర్శించారు. ప్రాజెక్టు పనులు ప్రారంభించి ఇక్కడ అక్కడ బండరాల కుప్పలు వేసి చుట్టుపక్కల మూడు గ్రామాలకు తీవ్ర ఇబ్బందులు కలగజేస్తున్నారని, ప్రాజెక్టు కట్టడాల కింద ఉన్న గ్రామాలకు నీరు రావు, నీట మునుగావని చెప్పలేమన్నారు. ప్రస్తుతం ఉన్న ప్రభుత్వం గానీ ఇంతకుముందున్న ప్రభుత్వం అయినా పద్ధతి (డిపిఆర్) లేకుండా కడుతున్నారని మండిపడ్డారు. ఇటీవల వరదలకు నీట మునిగిన చిన్న కారు రైతుల నుండి పెద్ద కరువు రైతులకు నామమాత్రంగా సర్వే చేశారే తప్ప వాటికి నష్టి పరిహారం ఇప్పటివరకు అందజేయలేదని తక్షణమే వీరికి నష్టపరిహారం అందజేయాలని డిమాండ్ చేసింది. మరియు అప్పుడు ప్రాజెక్టు కట్టడాల కోసం తీసుకున్న భూమి విలువ తక్కువగా ఉండగా ప్రస్తుత ధరతో ఇవ్వాలని లేదా భూమికి భూమి వేరేచోట ఇప్పించాలని రైతులతో పాటు డిమాండ్ చేస్తున్నట్లు తెలిపారు. ప్రాజెక్టును కట్ట దలుచుకున్నట్లయితే ప్రాజెక్టును త్వరగా పూర్తి చేయాలని ఆగమాగం ప్రాజెక్టును కట్టి ప్రజాధనాన్ని ఆగం చేస్తామంటే ఊరుకోమని జిల్లా కలెక్టర్ ఇరిగేషన్ అధికారులు కోఆర్డినేట్ గా మాట్లాడుకుని బిల్లులను ఒకేసారి తెప్పించుకొని పూర్తి చేయాలన్నారు. అనంతరం నిజాంసాగర్ ప్రాజెక్టును సందర్శించారు. ప్రాజెక్ట్ అధికారులతో నీటి వివరాలు అడిగి తెలుసుకున్నారు.



## స్త్రీనిధి రుణాల బకాయిల వసూలు

నాగి రెడ్డిపేట్, నవంబర్ 27(ప్రజాజ్యోతి): నాగిరెడ్డి పేట మండలంలోని రాఘవపల్లి గ్రామంలో గురువారం స్త్రీనిధి రుణాల బకాయిల వసూలు కోసం స్పెషల్ డ్రైవ్ నిర్వహించినట్లు ఏపీఎం రాంనారాయణ గౌడ్ తెలిపారు. ఈ స్పెషల్ డ్రైవ్ లో భాగంగా గ్రామంలోని రెండు మహిళా సంఘాల సభ్యుల నుంచి రూ.80 వేల మొండి బకాయి వసూలు చేసినట్లు ఏపీఎం తెలిపారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ గ్రామీణ బ్యాంక్ మేనేజర్ జ్ఞానేశ్వర్ కుమార్, ఫీల్డ్ ఆఫీసర్ ముత్యంరెడ్డి,సీసీ దత్తు,వివోఏ సాయిలు తదితరులు పాల్గొన్నారు.



### జిమ్నాస్టిక్స్ లో బంగారు పతకం సాధించిన బాలికను
## సన్మానించిన గ్రామపాలన అధికారి

సదాశివనగర్, నవంబర్ 27 (ప్రజాజ్యోతి) : జిమ్నాస్టిక్స్ లొ బంగారు పతకం సాధించిన బాలికను పాలన అధికారీ గురువారం శాలువాతో సన్మానం చేశారు. సదాశివనగర్ మండలం యాచారం గ్రామ పరిధిలోనీ రామ్ సింగ్ నాయక్ తండాకు చెందిన బానోతు శ్రీ దేవి(13) గత నవంబర్ 11 నుండి 15 వ తేదీ వరకూ ఒడిస్సా రాష్ట్రంలో నిర్వహించిన జాతీయ స్థాయి జిమ్నాస్టిక్స్ లో తెలంగాణ రాష్ట్రం నుండి బంగారు పతకం సాధించినందుకు గ్రామ పాలన అధికారీ గ్యార సాయిలు శాలువా కప్పి ఘనంగా సన్మానించారు .ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గాంధారి లోని ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్ నుండి జాతీయ స్థాయిలో పతకం తేవడం గొప్ప విషయం అని కొనియాడారు. భవిష్యత్తు లో మరిన్ని పథకాలు తేవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో తల్లిదండ్రులు, శ్రీ దేవి, శ్రీను, లలిత, గ్రామస్తులు మెతరి రమేష్, బానోతు వాసురం, దేవి, దేవి సింగ్, వెంగళరావు, పూరి బాయ్ తదితరులు పాల్గోన్నారు.

### ఇస్రోజీవాడి సర్పంచ్ అభ్యర్థిగా
# చిందం మల్లేష్ నామినేషన్



కామారెడ్డి రూరల్, నవంబర్ 27, ప్రజా జ్యోతి : వందలాది మంది కార్యకర్తలు, గ్రామస్తుల ర్యాలీతో గ్రామంలో ామారెడ్డి మండలంలోని ఇస్రోజీవాడి గ్రామం ఎన్నికల సందడి మధ్య నిన్న సర్పంచ్ అభ్యర్థి చిందం మల్లేష్ తన నామినేషన్ పత్రాలను దాఖలు చేశారు. గ్రామం మొత్తాన్ని ఉత్సవ వాతావరణం అలుముకున్న ఈ కార్యక్రమంలో వందలాది మంది పార్టీ కార్యకర్తలు, యువత, మహిళలు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు. స్వైరంగా నినాదాలు పలుకుతూ, భారీ బైక్ ర్యాలీతో, గులాబీ జెండాలతో మల్లేష్ నామినేషన్ ఊరేగింపు గ్రామంలో ప్రత్యేక ఆకర్షణగా మారింది. పంచాయతీ కార్యాలయం పరిసరాలు శుభాకాంక్షలతో కిక్కిరిసిపోయాయి.

*** గ్రామాభివృద్ధే నా ధ్యేయం – చిందం మల్లేష్**

నామినేషన్ అనంతరం చందం మల్లేష్ మాట్లాడుతూ: "ఇస్రోజీవాడి గ్రామంలో పెండింగ్‌లో ఉన్న ప్రతి అభివృద్ధి కార్యక్రమాన్ని పూర్తి చేయడం, తాగునీటి సమస్యలను పరిష్కరించడం, రహదారుల మెరుగుపరచడం, యువతకు ఉపాధి, మహిళా సంఘాలకు ప్రోత్సాహం— ఇవన్నీ నా ప్రాధాన్యతలు. ప్రజల ఆశీస్సులతో తప్పకుండా విజయం సాధించి గ్రామ అభివృద్ధికి కట్టుబడి పనిచేస్తాను" అని అన్నారు.

*** పార్టీ నాయకుల విశ్వాసం–ఆశల నిండిన గ్రామ ప్రజలు**

ఈ కార్యక్రమంలో పలువురు టీఆర్ఎస్ స్థానిక నాయకులు మాట్లాడుతూ, చిందం మల్లేష్‌కు గ్రామంలో విశాలమైన ప్రజాభిమానం ఉందని, ఆయన నాయకత్వంలో ఇస్రోజీవాడి మరింత అభివృద్ధి దిశగా పయనిస్తుందని అభిప్రాయపడ్డారు. గ్రామ మహిళలు, యువత పెద్ద సంఖ్యలో మద్దతు తెలియజేయడం ప్రత్యేకంగా కనిపించింది.

*** ఎన్నికల ఉత్సాహానికి శ్రీకారం**

మల్లేష్ నామినేషన్ దాఖలుతో ఇస్రోజీవాడిలో ఎన్నికల పోటీ వేడి మరింత పెరిగింది. ప్రజలు బహిరంగంగా అభ్యర్థికి మద్దతు తెలుపుతుండటం గ్రామం మొత్తం రాజకీయ చర్చలకు వేదికవుతోంది ఈ కార్యక్రమంలో కార్యకర్తలు మల్లేష్ గాండ్ల శ్రీనివాస్ కొత్త రాజు నరాల రవీందర్ రెడ్డి పద్మా రెడ్డి కొప్పుల సుదర్శన్ పోచయ్య సురేష్ బాల మల్లు కడారి మల్లేష్ మైపాల్ నారాయణ గాండ్ల రమేష్ తదితరులు పాల్గొన్నారు

## ప్రారంభమైన నామినేషన్లు పోటెత్తిన అభ్యర్థులు

దోమకొండ, నవంబర్ 27 (ప్రజా జ్యోతి) : దోమకొండ మండలంలో సర్పంచ్ అభ్యర్థుల నామినేషన్స్ జోరు షురూ అయింది నామినేషన్లు ప్రారంభం కావడంతో ఒక్కసారిగా ఎన్నికల వాతావరణం చోటుచేసుకుంది గ్రామాలలో ప్రజలు మౌలిక సదుపాయాలపై దృష్టి పెట్టాలని కొత్తగా వచ్చే సర్పంచ్ అభ్యర్థులకు సూచించారు. యువతలో కూడా ఎన్నికలలో పోటీ చేసే అవకాశం ఎక్కువగా కనిపిస్తుంది. ఈరోజు దోమకొండ మండలంలో ఎనిమిది మంది సర్పంచ్ అభ్యర్థుల నామినేషన్లు, పదమూడు వార్డ్ సభ్యుల నామినేషన్లు దాఖలు అయినట్టు ఎంపీడీవో ఎన్.ప్రవీణ్ కుమార్ తెలిపారు



## తెలంగాణ విశ్వవిద్యాలయ పరిధిలోని డిగ్రీ పరీక్షలో ఇద్దరూ డిబార్

నిజామాబాద్ రూరల్: నవంబర్, 27 (ప్రజా జ్యోతి) : తెలంగాణ విశ్వవిద్యాలయ పరిధిలోని డిగ్రీ సీ బీ సీ ఎస్ఒకటవ,మూడవ,ఐదవ, సెమిస్టర్ (రెగ్యులర్) మరియు రెండవ, నాల్గవ, ఆరవ, సెమిస్టర్ (2021, 2022, 2023, 2024, 2025 బ్యాచ్ ల) బ్యాక్ లాగ్ థియరీ పరీక్షలు ఉమ్మడి జిల్లా వ్యాపితంగా 30 సెంటర్లలో జరుగుచున్నవి. ఏడవ రోజు ఉదయం జరిగిన పరీక్షలకు 5974 మంది విద్యార్థులు ఉండగా 5674 మంది విద్యార్థులు హాజరు అయ్యారు 299 మంది విద్యార్థులు గైరాజరయ్యారు. మధ్యాహ్నం జరిగిన పరీక్షలకు 5589 మంది విద్యార్థులు ఉండగా 5117 మంది విద్యార్థులు హాజరు కాగా 471 మంది విద్యార్థులుగైరాజరయ్యారు. మంజీరా డిగ్రీ కాలేజీ కామారెడ్డి లో ఒకరు గవర్నమెంట్ డిగ్రీ కాలేజ్ బోధన్ లో ఒకరు డిబార్ అయ్యారని ఆడిట్ సెల్ డైరెక్టర్ ఆచార్య గంటా చంద్రశేఖర్ తెలిపారు.



# మాజీ ఎమ్మెల్యే పరామర్శలు

సదాశివనగర్, నవంబర్ 27, (ప్రజాజ్యోతి) : సదాశివనగర్ మండలం ఉత్తునూర్ ఎంపీటీసీ రామచంద్రరావు అనారోగ్యంతో ఆసుపత్రిలో చికిత్స నిమిత్తం ఇంటికి తిరిగి వచ్చారని తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే జాజల సురేందర్ పరామర్శించారు. వారితో మాట్లాడి ప్రస్తుత ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. తాము అండగా ఉంటామని మనోధైర్యం కల్పించారు. వైద్యుల సూచనలు పాటిస్తూ తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అలాగే వజ్జపల్లి గ్రామానికి చెందిన బిఆర్ఎస్ సీనియర్ కార్యకర్త గాదెపల్లి శివరాజు అనారోగ్యంతో మరణించారు. వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. వారికి బిఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు



# సర్పంచ్ అభ్యర్థిగా మొదటి నామినేషన్

*** మాజీ ఉపసర్పంచ్ ఉప్పల సాయికుమార్**

బీబీపేట్ మండల్, ప్రజా జ్యోతి, నవంబర్ 27 : బీబీపేట మండల కేంద్రంలో గ్రామ సర్పంచి అభ్యర్థురాలిగా మా భార్యను మొదటి నామినేషన్ దాఖలు చేయించడం జరిగింది. గతంలో నేను మాజీ ఉపసర్పంచిగా బీబీపేట గ్రామానికి చేసిన సేవలకు గాను నన్ను గుర్తించి నా భార్యకు భారీ మెజార్టీ తో గెలిపించి మమ్మల్ని ఆశీర్వదిస్తారని హృదయ పూర్వకంగా ప్రజలను కోరారు. నా భార్య ను మీ అందరికి అందుబాటులో ఉంచి సేవ చేసే భాగ్యాన్ని మాకు కల్పిస్తారని బీబీపేట గ్రామ ప్రజలను అభ్యర్థించారు.

# కామారెడ్డి మండలంలోని గ్రామాలలో మొదటి విడత సర్పంచ్ ఎలక్షన్లలో నామినేషన్ల పర్వం

కామారెడ్డి రూరల్, నవంబర్ 27, ప్రజా జ్యోతి : కామారెడ్డి మండలంలోని వివిధ గ్రామాలలో నామినేషన్ల పర్వం జ్వరం అందుకుంది వివిధ గ్రామాల్లో మొదటి విడత పంచాయతీ ఎలక్షన్లలో నామినేషన్లు వేయడం జరిగింది గర్గుల్ సర్పంచ్ అభ్యర్థిగా నాలుగు నామినేషన్లు నాలుగు వార్డ్ మెంబర్ల నామినేషన్ ఇస్రోజీ వాడి నాలుగు సర్పంచ్ అభ్యర్థులు నాలుగు వార్డ్ మెంబర్లు క్యాసం పల్లి మూడు సర్పంచ్ ఐదు వార్డ్ మెంబర్లు లింగయ్య పల్లి ఒకటి సర్పంచ్ అభ్యర్థిగా నరసన్నపల్లి సర్పంచ్ అభ్యర్థిగా ఉగ్రవాయి ఒకటి సర్పంచ్ అభ్యర్థిగా నామినేషన్లు మొత్తం మొదటి రోజు నామినేషన్లు 14 సర్పంచ్ అభ్యర్థులు నామినేషన్ వేశారు 15 వార్డ్ మెంబర్లు నామినేషన్ వేయడం జరిగింది వేశారని కామారెడ్డి ఎంపీడీవో ఎఫ్ సి బారని పేర్కొన్నారు ఇంకా ఇంకా రెండు రోజులు ఉంది కాబట్టి ఇంకా ఎక్కువ సంఖ్యలో నామినేషన్లు వస్తాయని అంచనా వేశారు

# ఆశీర్వదించండి అభివృద్ధి చేసి చూపిస్తా

*** బండి ప్రవీణ్ అభ్యర్థి**



రామారెడ్డి నవంబర్ 27 (ప్రజా జ్యోతి) : రామారెడ్డి గ్రామ సర్పంచ్ అభ్యర్థిగా నామినేషన్ మొదటి రోజు రామారెడ్డి యువకుడు బండి ప్రవీణ్ నామినేషన్ సెట్ వేయడం జరిగింది. తను మాట్లాడుతూ యువకుడిగా నన్ను గెలిపించండి అభివృద్ధి చేసి చూపిస్తాను. రాజకీయంగా, ఆర్థికంగా, సమాజ సేవకు, ముందుండే వ్యక్తిగా సేవ చేయడానికి ఈ యొక్క అవకాశాన్ని నిస్వార్థంగా రామారెడ్డి గ్రామ ప్రజలకు అక్కలకు అన్నలకు తమ్ముళ్లకు చెల్లెళ్లకు ముఖ్యంగా యువతకు అన్ని రకాలుగా అందుబాటులో ఉండి రామారెడ్డి గ్రామ అభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తానని అన్నారు.ఒక్కసారి ఆలోచించండి ఒక్క సారి అవకాశం ఆదరించండి. అభివృద్ధి చేసి చూపెడతా ఆశతో ఉన్న వాడికి అధికారం ఇస్తే దోచుకుంటాడు దయచేసి ఒక్క అవకాశం ఇచ్చి మీ అమూల్యమైన ఓటు వేసి నన్ను ఆశీర్వదించ వలసిందిగా కోరారు. ఆశయంతో ఉన్నవాడికి అధికారమిస్తే అభివృద్ధి చూపెడతను అని భారీ ఎత్తున జన సందోహంతో మొదటి సెట్ నామినేషన్ వేయడం జరిగింది.

# ప్రభుత్వ పాఠశాలను సందర్శించిన రాష్ట్ర పరిశీలకులు



భిక్కనూరు, నవంబర్ 27 (ప్రజాజ్యోతి) : భిక్కనూరు మండలంలోని బస్వాపూర్ లోని జిల్లా పరిషత్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల మరియు పెద్ద మల్లారెడ్డి జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలను గురువారం రాష్ట్ర స్థాయి పరిశీలకులు ఎల్లయ్య సందర్శించి కాంప్లెక్స్ సమావేశాలను నిర్వహించడం జరిగింది. ఇందులో సాంఘిక శాస్త్రం,జీవశాస్త్రం పరిశీలించడం జరిగింది. అలాగే లిప్ ప్రోగ్రామ్ మరియు ఎఫ్ ఎల్ ఎన్ ప్రోగ్రాం సంబంధించిన ప్రశ్న పత్రాలను పరిశీలించడం జరిగింది. ఈ సందర్భంగా రాష్ట్రస్థాయి పరిశీలకులు ఎల్లయ్య మాట్లాడుతూ... విద్యార్థులు ఎంతో కష్టతరంగా భావించే సాంఘిక శాస్త్రం, జీవశాస్త్రంలను సులభతరమైన పద్ధతిలో పాటలుగా కాకుండా ప్రయోగాత్మకంగా విద్యార్థులకు బోధించాలని, విద్యార్థులకు అర్థమయ్యే విధంగా వినూత్న రీతిలో పాఠ్యాంశాల బోధన చేపట్టాలని సూచించారు.ఈ కార్యక్రమంలో బిక్నూర్ మండల విద్యాధికారి రాజగంగారెడ్డి, ప్రధానోపాధ్యాయులు వెంకటేశ్వర్లు,ప్రసనా దేవి, సుజాత,రాణి, సిఆర్పిలు పాల్గొనడం జరిగింది.

# ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించాలి

*** ఆర్డీవో పార్థసింహా రెడ్డి...**





నాగిరెడ్డిపేట్, నవంబర్ 27(ప్రజాజ్యోతి): గ్రామ పంచాయతీ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలని ఎల్లారెడ్డి ఆర్డీవో పార్థసింహారెడ్డి అధికారులను ఆదేశించారు.గురువారం నాగిరెడ్డిపేట్ మండల కేంద్రంలోని మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ మండలంలో 8 నామినేషన్ కేంద్రాలు ఏర్పాటు చేశామని మండలంలో జిల్లా సరిహద్దు ప్రాంతమైన పోచారం వద్ద చెక్ పోస్ట్ ఏర్పాటు చేసి ఎస్ఎస్టి,ఎఫ్ఎస్టి తనిఖీ బృందాల ఏర్పాటు చేసినట్లు తెలిపారు.నవంబర్ 30 నుంచి డిసెంబర్ 02వరకు నామినేషన్లు స్వీకరించనున్నట్లు తెలిపారు.డిసెంబర్ 06 తేదీన అభ్యర్థుల తుదిజాబితా ప్రచురిస్తామని తెలిపారు. డిసెంబర్ 14 తేదీన ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పోలింగ్ ఉంటుందని, మధ్యాహ్నం 2 గంటల నుంచి కౌంటింగ్ నిర్వహించనున్నట్లు తెలిపారు.అనంతరం ఎన్నికల సామాగ్రిని పరిశీలించారు.ఈ కార్యక్రమంలో తహాశీల్దార్ శ్రీనివాస్ రావు,ఎంపీడీఓ లలితా కుమారి, సిబ్బంది పాల్గొన్నారు.



## నామినేషన్లు షురూ

బిబిపేట్ మండల్, ప్రజా జ్యోతి, నవంబర్ 27 : బీబీపేట మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామపంచాయతీ ల సర్పంచ్ అభ్యర్థుల నామినేషన్ మొదలయింది. ఈ సందర్భంగా మండల అభివృద్ధి అధికారి పూర్ణ చంద్ర కుమార్ మాట్లాడుతూ బీబీపేట మండలంలో మొత్తం 11 గ్రామపంచాయతీ స్థానాలకు గురువారం 11 సర్పంచ్ నామినేషన్లు బిబిపేటలో 4, ఉప్పరపల్లి 4 మల్కాపూర్ 1, యాడవరం 2, జనగామ 1, చొప్పున మరియు 110 వార్డు లకు గాను వార్డ్ సభ్యుల నామినేషన్లు 6 బిబిపేట్ లో 3, యాడవరం 2 ఉప్పర్ పల్లి 1 చొప్పున వచ్చాయని తెలిపారు.

## నామినేషన్ కేంద్రాల వద్ద 144 సెక్షన్

*** ఎస్ ఐ కొండ విజయ్**





బీబీపేట్ మండల్, ప్రజా జ్యోతి నవంబర్ 27 : బీబీపేట మండల కేంద్రంలో స్థానిక గ్రామ పంచాయతీ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ సందర్భంగా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేస్తున్నట్లు ఎస్సై కొండ విజయ్ తెలియజేశారు. అనంతరం ఎస్సై విజయ్ నామినేషన్ కేంద్రాన్ని సందర్శించారు. నామినేషన్ల ప్రక్రియ శాంతియుతంగా, ప్రశాంతంగా జరిగేందుకు ప్రతి కేంద్రం వద్ద పోలీస్ సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. అభ్యర్థులు, వారి అనుచరులు నియమాలను పాటించి, ఇలాంటి గొడవలు జరగకుండా తమతో సహకరించాలని ఆయన కోరారు.



## గర్గుల్ సర్పంచ్ అభ్యర్థిగా
# కొత్తూరు సంజన నామినేషన్

కామారెడ్డి రూరల్, నవంబర్ 27, ప్రజా జ్యోతి : గర్గుల్ గ్రామ సర్పంచ్ ఎన్నికల రంగంలో నూతన ఉద్వేగానికి నాంది పలుకుతూ కొత్తూరు సంజన బుధవారం తన నామినేషన్ పత్రాలు ఘనంగా దాఖలు చేశారు. గ్రామం నలుమూలల నుంచి పెద్దఎత్తున వచ్చిన మహిళలు, యువత, వృద్ధులు - సంజనకు మద్దతు తెలుపుతూ ప్రదర్శనగా వచ్చిన తీరు గ్రామ రాజకీయాల్లో కొత్త చైతన్యాన్ని నెలకొల్పింది. సంజన మాట్లాడుతూ: “గ్రామ అభివృద్ధి, పారదర్శక పాలన, శుద్ధమైన సేవ - ఇవే నా ప్రతిజ్ఞ” అని స్పష్టం చేశారు. నీటి సమస్యలు, రహదారి సదుపాయాలు, శుభ్రత, మహిళా సాధికారత వంటి అంశాలను అత్యంత ప్రాధాన్యంగా తీసుకుని పనిచేస్తానని హామీ ఇచ్చారు. గ్రామంలో ఎన్నికల ఉత్సాహం ఊపందుకుంటున్న నేపథ్యంలో సంజన నామినేషన్ దాఖలు గ్రామ ప్రజల్లో కొత్త ఆశలను రేకెత్తించింది.

# పల్లెల్లో బార్లను తలపిస్తున్న బెల్టు షాపులు



*** వైన్ షాపుల్లో ఉండే బ్రాండ్లు, బెల్ట్ షాపుల్లో లభ్యం**

*** అధిక ధరలకు విక్రయాలు**

*** ఒకవైపు కల్లు.. మరోవైపు బెల్ట్ షాపులతో జనాలు బెంబేలు**

*** ఎక్సైజ్ శాఖ అధికారుల కనుసన్నల్లోనే....?**

*** కల్తీ కల్లు,బెల్ట్‌పై కొరవడిన నిఘా..!**

*** ప్రజా జ్యోతి ప్రత్యేక కథనం....**

భిక్కనూరు,నవంబర్27(ప్రజాజ్యోతి): పల్లెల్లో బెల్ట్ షాపుల దందా జోరుగా సాగుతోంది. పల్లెలు మొదలుకొని మారుముల గ్రామాల వరకు రాత్రింబవళ్లు మత్తులో ఊగుతున్నాయి. గ్రామాలు,తండాల్లో పుట్టగొడుగుల్లాగా బెల్టు షాపులు వెలుస్తున్నాయి. నిబంధనలకు విరుద్ధంగా బెల్ట్ షాపులు ఏర్పాటు చేసి అధిక ధరలకు విక్రయిస్తున్నారు. అనేకమంది బెల్టు షాపుల్లో మద్యం కొనుగోలు చేసి జేబులు గుల్ల చేసుకుంటున్నారు. అప్పులు చేసి తాగడంతో కాపురాలు వీధి పాలవుతున్నాయి. జిల్లాలోని పలు మండలాలలో అధికారిక వైన్ షాప్ కు నిత్యం వచ్చే మద్యం ప్రియులకు ఎమ్మార్పీ ధరకు అమ్మకాలు చేస్తున్నారు. కానీ సిండికేట్ కారణంతో విచ్చలవిడిగా ముందుగానే బెల్ట్ షాపులకు మందు సప్లై సమయానికి అరగంట ముందే షాప్ క్లోజ్ చేస్తున్నారు. అదేంటని మందుబాబులు అడిగితే లెక్కలు చేసుకుంటున్నాం షాప్ క్లోజ్ అయింది అంటున్నారు. గత్యంతరం లేక బెల్టు షాపులకు వెళ్లడంతో మూడు పువ్వులు ఆరు కాయలుగా పెరుగుతున్నదందా. బెల్టు షాపు నిర్వాహకులు క్వార్టర్ పైప10 రూపాయలు, హాఫ్ పై ₹20, ఫుల్లు పై 80 రూపాయలు, బీరుపై 20 రూపాయలు అదనంగా వసూలు చేస్తున్నారు.వైన్ షాపుల్లో ఉండే ప్రతి ఒక బ్రాండ్ బెల్ట్ షాపుల్లో ఉండడం గమనార్హం? ప్రతి ఒక్క గ్రామంలో గల్లి గల్లికి బెల్టు షాపులు వెలవడంలో ఆంతర్యం ఏమిటో అర్థం కాని పరిస్థితి, ఒక్క మాటలో చెప్పాలంటే సంబంధిత అధికారులు, కేవలం గుడుంబా స్థావరాలు పైనే దృష్టి పెట్టడంతో పరోక్షంగా బెల్టు షాపుల నిర్వహణకులను పెంచి పోషించినట్లు ఉందని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

*** పచ్చని సంసారాల్లో మద్యం, కల్లు చిచ్చు**

గ్రామాల్లో విచ్చలవిడిగా కల్లు మరియు మద్యం దొరకడంతో పచ్చని సంసారాల్లో చిచ్చు పెడుతుంది. ఊరురా బెల్ట్ షాపులు పుట్టగొడుగుల్లా వెలుస్తున్నాయి. అంతే జోరుగా కల్తీ కల్లు ఏరులై పారుతుంది. దీంతో పొద్దంతా పనిచేసే సంపాదించిన సొమ్మును మద్యానికి వెచ్చించి కుటుంబాలను వీధిన పడేస్తున్నారు. గ్రామాల్లో బెల్ట్ షాపుల నిర్వహణ మరియు కల్తీకల్లుతో యువత పెడదారి పడుతుంది ఎక్సైజ్ అధికారులు మామూళ్ల మత్తులో..? జరుగుతున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

*** గ్రామాల్లో బెల్ట్ షాపుల వేలం పాటలు**

మండల కేంద్రంలోని పలు గ్రామాల్లో బెల్ట్ షాపుల నిర్వహణకు వేలం వేస్తున్నారు. గ్రామ పెద్దలంతా కలిసి గ్రామ అభివృద్ధి కోసం కొంత సొమ్ము ఇవ్వాలని తీర్మానాలు సైతం చేస్తున్నారు. ఈ సొమ్మును గ్రామంలోని పలు అభివృద్ధి పనులకు వాడుతున్నారు. మండలంలో లక్షలలో వేలం పాటలు జరుగుతున్నాయి. ఏడాది నుంచి 2 ఏళ్ల పాటు గ్రామంలో మద్యం విక్రయాలు నిర్వహించుకునేందుకు వైన్ షాపుల యజమానులు కూడా అనధికారికంగా తీర్మానం ఇస్తున్నారు. ఇలా అనేక గ్రామాల్లో ఈ తంతు కొనసాగుతుంది.

*** అధికారుల కనుసన్నాల్లోనేనా...?**

మండల వ్యాప్తంగా ప్రతినెల బెల్ట్ షాపుల ద్వారా లక్షల్లో మద్యం విక్రయాలు జరుగుతున్నాయి. వైన్స్ యజమానులు, ఎక్సైజ్ పోలీసు అధికారుల అండదండలతో..? మండలాల్లోని గ్రామాల్లో వేలంపాట ద్వారా సుమారు 7 లక్షల నుండి తొమ్మిది లక్షల వరకు వేలం పాటలు పాడి బెల్ట్ షాపులను దక్కించుకుంటున్నారూ. ఈ విధంగా గ్రామస్థాయి రాజకీయ నాయకుల నుండి పై స్థాయి రాజకీయ నాయకుల అండదండలతో ఎక్సైజ్ శాఖ కనుసన్నాల్లో బెల్ట్ షాపులు ఏర్పాటు అవుతున్నాయా? మద్యం అధికారికంగా విక్రయించడానికి ప్రభుత్వం ఎక్సైజ్ అధికారుల ద్వారా మద్యం వ్యాపారులపై ఒత్తిడి తీసుకువస్తుందని, ఈ క్రమంలోనే మద్యం వ్యాపారులు సిండికేట్ గా మారి ఎక్కువ ధరలకు ఊరూరా బెల్టు షాపులు పెట్టి అనధికారికంగా అమ్ముతున్నారన్న విమర్శలు ఉన్నాయి.

*** యువత పెడదారికి ఎవరు బాధ్యత..?**

గ్రామీణ ప్రాంతాలలో ఆర్థికంగా బలపడిన కుటుంబాలు ఉండవు.కాబట్టి కాస్తంత సేద తీర్చుకో నీకు కళ్ళుబట్టిలలో అమ్మే కళ్ళు సేవిస్తూ విశ్రాంతి తీసుకునేవారు ఉన్నారు. కానీ నేటి తరుణంలో విచ్చలవిడిగా మద్యం అమ్మకాలు గల్లి గల్లీలలో జోరుగా విక్రయించడం వలన యువత కాస్త పెడదారి పట్టే అవకాశాలు లేకపోలేదు. ఈ రోజుల్లో జరుగుతున్న బెట్టింగులు, కానీ క్రికెట్ ఫిక్సింగ్,గాని ముఖ్యంగా బర్త్డే పార్టీ,పెండ్లి డిన్నర్,దావతు, రిసెప్షన్ దావతులు,భరత్ కార్యక్రమాలను విచ్చలవిడిగా నిర్వహిస్తున్న తరుణంలో మద్యాన్ని సేవించడం ఒక ట్రెండ్ గా మారింది. తద్వారా యువత మత్తుకు బానిసై వివిధ రకాల నేరాలు చేసి నేరస్తులుగా మారి సంఘవిద్రోహ చర్యలకు పాల్పడుతున్నారు. దీనికి బాధ్యులు ఎవరు.?

*** తనిఖీల పేరుతో కాలయాపన..?**

ఎక్సైజ్ శాఖ అధికారులు తనిఖీల పేరుతో కాలయాపన చేయడం మానేసి, ఇకనైనా మద్యం, కల్తీ కల్లు దుకాణాలపై శ్రద్ధ పెడితే ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు పునరావృతం కాకుండా ఉంటాయని, ప్రస్తుతం రాష్ట్రంలో, జిల్లాల్లో జరుగుతున్న అనేక రోడ్డుప్రమాదాలు, హత్యలు, నేరాలు జరగడానికి ప్రధాన కారణంగా విచ్చలవిడిగా మద్యం సేవించడం. మద్యం మత్తులో మందు బాబులు పేట్రేగిపోయి వివిధ దౌర్జన్యాలకు, విధ్వంసాలకు కారణమవుతూ, వారికి సంబంధించిన కుటుంబాలలో కల్లోలను సృష్టిస్తూ, కుటుంబాలను నాశనం చేసుకుంటున్నారు. ఇకనైనా ఎక్సైజ్ శాఖ కట్టుదిట్టమైన మార్గదర్శకాలతో ప్రజలలో అవగాహన కల్పిస్తూ, ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించిన షాపులపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు ఆకాంక్షిస్తున్నారు.




## ధర్పల్లి ఎరువుల కేంద్రాన్ని పరిశీలించిన ఏవో వెంకటేష్



ధర్పల్లి: నవంబర్ 27 (ప్రజా జ్యోతి) : ధర్పల్లి వ్యవసాయ అధికారి వెంకటేష్ గురువారం మండల కేంద్రంలోని గ్రోమోర్ ఎరువుల కేంద్రాన్ని పరిశీలించారు రైతులు వరి నాట్లు ప్రారంభించిన సందర్భంలో కావాల్సిన ఎరువుల స్టాకును తనిఖీ చేశారు రికార్డుల ప్రకారం దుకాణంలో 1465 ఎరువుల బస్తాలు ఉన్నట్టు ఆయన తెలిపారు మండలంలో 10 ఎరువుల దుకాణాలను ఉన్నట్టుగా ఆయన పేర్కొన్నారు రైతులు జింకులోప నివారణ కొరకు ఒక ఎకరానికి 20 కిలోల జింక్ సల్ఫేట్ ను వేసుకోవాలని ఆయన సూచించారు




## పిడిఎస్ యు 23వ జిల్లా మహాసభలను జయప్రదం చేయండి

నిజాంబాద్ రూరల్, నవంబర్ 27 (ప్రజా జ్యోతి) : సిరికొండ మండలంలో గల ఆదర్శ పాఠశాల కళాశాలలో పిడిఎస్ యు 23వ జిల్లా మహాసభ పోస్టర్లను గురువారం విద్యార్థుల మధ్యలో మండల అధ్యక్షుడు మారుపాక రాజేష్ ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈనెల 28 29 ఆర్మూర్ లో జరిగే మహాసభలు విజయవంతం చేయాలని కోరారు ఈ కార్యక్రమంలో ప్రకాష్, విష్ణు, మనోజ్, విశ్వతేజ, రిషిత్, తదితరులు పాల్గొన్నారు.

# సిరికొండలో పంచాయతీ అభ్యర్థులకు కీలక సూచనలు

**– కొత్త అకౌంట్ తప్పనిసరి, ఖర్చులకు కఠిన పరిమితులు: ఎంపీడీవో మనోహర్ రెడ్డి స్పష్టం**

నిజామాబాద్ రూరల్: నవంబర్, 27 (ప్రజా జ్యోతి) : రాబోయే సాధారణ గ్రామ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించేందుకు సిరికొండ మండల ఎంపీడీవో కె. ఆర్. మనోహర్ రెడ్డి అభ్యర్థులకు కీలక సూచనలు గురువారం జారీ చేశారు. అభ్యర్థుల నామినేషన్ దాఖలు నుండి ఎన్నికల ఖర్చుల సమర్పణ వరకు అనుసరించాల్సిన ప్రతీ చర్యను స్పష్టంగా వివరించారు. ఎన్నికల సమయాల్లో గందరగోళాలు, విమర్శలు, నిబంధనల ఉల్లంఘనలు చోటు చేసుకోకుండా ముందస్తు హెచ్చరికతోనే నియమాలను వెల్లడించడం విశేషం.

*** నామినేషన్‌కు అవసరమైన పత్రాలు తప్పనిసరి**

ఎంపీడీవో మనోహర్ రెడ్డి మాట్లాడుతూ: “ప్రతి అభ్యర్థి తమ నామినేషన్ పత్రంతో పాటు ఓటర్ ఐడి, క్యాస్ట్ సర్టిఫికేట్, కొత్త బ్యాంక్ అకౌంట్ నెంబర్ జిరాక్స్ సమర్పించాలి. ఇవేమైనా లేకుంటే నామినేషన్ చెల్లదు’’ అని స్పష్టం చేశారు. ముఖ్యంగా కొత్త బ్యాంక్ అకౌంట్ తప్పనిసరి అని, ఎన్నికల ఖర్చులన్నీ ఈ కొత్తగా తెరిచిన అకౌంట్ నుంచే జరగాలని నిబంధన ఉందని చెప్పారు. పోస్ట్ ఆఫీస్, ఎండీసీసీ బ్యాంక్, స్టేట్ బ్యాంక్, గ్రామీణ బ్యాంకులు వంటి ఏ బ్యాంకులోనైనా ఖాతా తెరవొచ్చని తెలిపారు.

*** కుటుంబ సభ్యుల పేరిట అకౌంట్ ఓపెన్ చేయడం నేరమే**



*** ఎంపీడీవో చెప్పిన ముఖ్యమైన అంశం ఇదే...**

“ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థి ఫ్యామిలీ మెంబర్స్ పేరుతో లేదా ఇతరుల పేరుతో అకౌంట్ తెరిస్తే అది ప్రత్యక్షంగా ఎన్నికల నిబంధనల ఉల్లంఘన. ఖర్చును గోప్యంగా మార్చే ప్రయత్నంగా చూస్తారు. అలాంటి నామినేషన్లు రద్దయ్యే అవకాశమూ ఉంది’’ అని హెచ్చరించారు.

*** ఎన్నికల ఏజెంట్‌కు ప్రత్యేక అవకాశం**

పోటీదారు తన ఎన్నికల ఏజెంట్ తో కలిసి జాయింట్ అకౌంట్ తెరవచ్చు. కానీ ఏజెంట్ పేరు మీద ఒక్కరే బ్యాంక్ అకౌంట్ తెరవడాన్ని పూర్తిగా నిషేధించారు.

*** ఎన్నికల ఖర్చులు – అధికంగా చేస్తే నేరమే**

ఎన్నికల సమయంలో భారీగా డబ్బు వెచ్చించి ప్రజలను ప్రభావితం చేసే దోపిడీ రాజకీయాలకు అడ్డుకట్ట వేసేందుకు ప్రభుత్వము ఖర్చులపైనా పరిమితులు విధించింది. ఇవే ఎంపీడీవో వివరాలు:

జనాభా 5,వేల పైబడిన గ్రామాలు సర్పంచ్ అభ్యర్థి: 2, లక్షల 50,వేల రూపాయలు,వార్డు మెంబర్: 50, వేల రూపాయలు ఖర్చు చేయవచ్చు.జనాభా 5, వేల లోపు గ్రామాలు సర్పంచ్ అభ్యర్థి: 1, లక్ష 50, వేల రూపాయలు వార్డు మెంబర్: 30, వేల రూపాయలు ఖర్చు చేయవచ్చు. “ఈ గరిష్ఠ పరిమితికి మించి అభ్యర్థి ఒక్క రూపాయి కూడా ఖర్చు చేయకూడదు. ఎవరు ఎంత ఖర్చు చేశారో ఎన్నికల తర్వాత మండల కార్యాలయం ఖచ్చితంగా పరిశీలిస్తుంది’’ అని ఎంపీడీవో అన్నారు.

*** ఎన్నికల తర్వాత 45 రోజుల్లో ఖర్చుల వివరాలు సమర్పణ తప్పనిసరి**

ఎన్నికల ఫలితాలు ప్రకటించిన రోజుతో 45 రోజుల్లో—ఖర్చుల వివరాలు బిల్లులు, వాటి లెక్కల పట్టిక బ్యాంక్ స్టేట్‌మెంట్, అన్నీ మండల కార్యాలయానికి సమర్పించాలని తెలిపారు.

**“గుర్తు పెట్టుకోండి...**

ఖర్చుల వివరాలు సమర్పించని అభ్యర్థిపై చట్టపరమైన చర్యలు తప్పవు’’ అని ఎంపీడీవో మనోహర్ రెడ్డి స్పష్టం చేశారు.

*** ఎన్నికలు ప్రశాంతంగా, పారదర్శకంగా ఉండాలి – ఎంపీడీవో సందేశం**

మనోహర్ రెడ్డి మాట్లాడుతూ— “ఎన్నికలు కేవలం ఓటు పోటీలే కాదు... ప్రజాస్వామ్య పండుగ. అభ్యర్థులు నిబంధనలు పాటిస్తేనే ప్రజలకు మంచి సందేశం వెళుతుంది. అక్రమాలు, అధిక ఖర్చులు, కుటుంబ సభ్యుల అకౌంట్లు—ఇవి అన్నీ పూర్తిగా నిషేధితం. ప్రతి అభ్యర్థి చట్టాన్ని కాపాడాలి’’ అని సూచించారు.

*** సిరికొండ మండలంలో ఎన్నికల వాతావరణం**

గ్రామాల్లో ఇప్పటికే నాయకులు, అభ్యర్థుల సందర్శనలు, వ్యూహాలు వేగం పెంచుకున్నాయి. ప్రజలు కూడా అభ్యర్థులపై తమ అభిప్రాయాలను చర్చించుకుంటూ ఎన్నికల జోరు మొదలైనట్లు కనిపిస్తోంది.

# పోలీసుల పేరిట బెదిరింపులు

కామారెడ్డి: దేవునిపల్లి ఠాణా పరిధిలో పోలీసుల పేరిట బలవంతంగా వసూళ్లకు పాల్పడినవారిని గురువారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. పోలీసులు వెల్లడించిన వివరాల ప్రకారం.. కామారెడ్డి జిల్లాకేంద్రం శివారులో సరంపల్లి ఎక్స్ రోడ్డు వద్ద వాహనాలను తనిఖీ చేస్తున్న సమయంలో అనుమానాస్పదంగా ఉన్న కారును ఆపారు. అందులోంచి జింక భాస్కర్, లక్ష్మణ్ పారిపోవడానికి యత్నించారు. వారిని పట్టుకుని విచారించగా చిన్నమల్లారెడ్డి ఎల్లమ్మ గుడి వద్ద పోలీసుల పేరిట ఓ వ్యక్తి నుంచి రూ.1800, చరవాణులను లాక్కున్నట్లు తేలింది. నిందితులు భాస్కర్, లక్ష్మణ్‌ను అరెస్టు చేశారు. వారి నుంచి చరవాణులు, కారును స్వాధీనం చేసుకున్నారు. వసూళ్ల ఘటనలో నిందితుల స్నేహితులు కూడా భాగస్వాములైనట్లు గుర్తించారు. ఎలాంటి దోపిడీలు జరిగినా ప్రజలు పోలీసుశాఖకు సమాచారం ఇవ్వాలని ఎస్పీ రాజేశ్‌చంద్ర అన్నారు.



# నిఘా నీడన పల్లె పోరు

కామారెడ్డి కలెక్టరేట్: జిల్లాలో ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులో ఉన్నంత కాలం కోడ్ ఉల్లంఘనలు జరగకుండా అధికారులు కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నారు. ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు(ఎఫ్ఎస్టీ), ఐదు స్టాటిక్ సర్వైలెన్స్(ఎస్ఎస్టీ) బృందాలను నియమించారు. ఈ బృందాలు అక్రమ మద్యం, పెద్ద మొత్తంలో నగదు రవాణా, ఓటర్లకు మద్యం, నగదు పంపిణీ వంటి కార్యక్రమాలను అడ్డుకోవడంతో పాటు ఓటర్లను ప్రలోభ పెట్టకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటారు. సరిహద్దుల్లో తనిఖీ కేంద్రాలు ఏర్పాటు చేసి నిఘా పెడుతారు.

**ఏం చేస్తారంటే..**

**ఎఫ్ఎస్టీ:** మండలానికి ఒకటి చొప్పున జిల్లాలో 25 బృందాలను ఏర్పాటు చేశారు. ఎన్నికల ప్రచార సమయంలో కోడ్ ఉల్లంఘనలు, నియమావళి సరిగా అమలు చేయకపోవడం వంటి ఫిర్యాదులపై ఎఫ్ఎస్టీలు స్పందిస్తాయి. ఒక్కో బృందంలో ముగ్గురేసి అధికారులు ఉండేలా చర్యలు తీసుకున్నారు.

**ఎస్ఎస్టీ:** ఇతర జిల్లాలు, రాష్ట్రాల నుంచి వచ్చే వాహనాలపై నిఘా పెట్టడానికి స్టాటిక్ సర్వైలెన్స్ బృందాలను నియమించారు. ఈ బృందాల్లో ఒక ఉప తహసీల్దార్, నలుగురు పోలీసులు, ఒక వీడియోగ్రాఫర్ ఉంటారు. వీరు వాహనాల రాకపోకలపై నిరంతరం నిఘా పెడతారు.

**రశీదులు చూపాలి:** ఎన్నికల సంఘం నిర్ణయించిన నగదు కంటే ఎక్కువ తీసుకెళ్తే పట్టుకుంటారు. రూ.10 వేల విలువైన ఒకే రకమైన వస్తువులు రవాణా చేస్తే ఆయా బృందాలకు వివరణ ఇవ్వాలి. నగదుకు రశీదులు చూపించాలి. గంపగుత్తగా చీరలు, మద్యం వంటికి తీసుకెళ్లినా ఆధారాలు అడుగుతారు. రూ.50 వేల కంటే అధికంగా నగదు ఉంటే రశీదులు చూపాలి. సరైన ఆధారాలు చూపకుంటే వస్తువులు, నగదు స్వాధీనం చేసుకుంటారు.

**తనిఖీ కేంద్రాలు:** కర్ణాటక-తెలంగాణ సరిహద్దు గ్రామమైన సోపూర్ వద్ద, మహారాష్ట్ర- తెలంగాణ సరిహద్దు సలాబత్‌పూర్ వద్ద తనిఖీ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నారు. ఈ తనిఖీ కేంద్రాల్లో ఎస్ఎస్టీ బృందాలు 24 గంటల పాటు నిఘా పెడతాయి. వాహనాన్ని ఆపి తనిఖీ చేస్తారు.



# బీజేపీ–బీఆర్ఎస్ నాయకులకు కాంగ్రెస్‌లో భారీ స్వాగతం

* **రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి సాక్షిగా పెద్ద ఎత్తున చేరికలు**



నిజామాబాద్ రూరల్, నవంబర్ 27 (ప్రజా జ్యోతి) : నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ రేకులపల్లి భూపతిరెడ్డి క్యాంప్ కార్యాలయంలో గురువారం కాంగ్రెస్ పార్టీలో బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలకు చెందిన కీలక గ్రామ నాయకులు, ప్రభావశీల కార్యకర్తలు పెద్ద ఎత్తున చేరారు. రెండు పార్టీలకు గ్రామ స్థాయిలో పునాదుల్లాంటి నాయకులు కాంగ్రెస్‌లో చేరడంతో మండల వ్యాప్తంగా రాజకీయ చర్చలకు ఇది కేంద్ర బిందువైంది.చిన్న వాల్గోట్-గడ్కోల్ నుంచి ప్రధాన నాయకుల చేరిక. ఈ చేరికల్లో ముఖ్యంగా చిన్న వాల్గోట్ నుంచి బీఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు గణేష్,మాజీ ఉప సర్పంచ్ ప్రసాద్,సంతోష్,చిన్న గణేష్, దాసు,వీడికే చైర్మన్ గంగారెడ్డి,భాస్కర్ రెడ్డి, రాజారెడ్డి,రమణ గౌడ్, బుర్రయ్య, గంగారెడ్డి, పొగిరి స్వామి, హరిదాస్ తదితరులు కాంగ్రెస్ గూటిలోకి చేరారు. గడ్కోల్ నుంచి బీఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు గంగారెడ్డి,బిజెపి సిరికొండ మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు చంద్ర శంకర్, జ్ఞానేందర్, భరత్, రఘు, అజయ్, రంజిత్, తదితరులు కూడా కండువా కప్పి కాంగ్రెస్ పార్టీలోకి ఆహ్వానం పొందారు. ఎమ్మెల్యే భూపతిరెడ్డి స్వయంగా ఈ నాయకులందరికీ కాంగ్రెస్ కండువాలు కప్పి స్వాగతం పలికారు."కాంగ్రెస్ అభివృద్ధి పనులు చూసి ప్రజలు, నాయకులు భారీగా చేరుతున్నారు" — ఎమ్మెల్యే భూపతిరెడ్డి చేరికల అనంతరం రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి మాట్లాడుతూ— "కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పనులు, ప్రజాకేంద్రీకృత పాలన చూసి అన్ని పార్టీలకు చెందిన నాయకులు స్వచ్ఛందంగా కాంగ్రెస్‌లో చేరుతున్నారు. గ్రామ స్థాయి నాయకుల ఈ చేరికలు పార్టీ పటిష్టతను మరింతగా పెంచుతాయి" అని అన్నారు.మండలంలో జరుగుతున్న అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాల అమలు, ప్రజలకు అందుతున్న పారదర్శక సేవలు కాంగ్రెసుపై ప్రజల నమ్మకాన్ని పెంచుతున్నాయని ఆయన పేర్కొన్నారు. కాంగ్రెస్ నేతల సమక్షంలో ఘన స్వాగతంఈ కార్యక్రమంలో పాల్గొన్న ముఖ్య నాయకులు డిసిసిసి ప్రధాన కార్యదర్శి వెల్మ భాస్కర్ రెడ్డి,సిరికొండ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బాకారం రవి, డిసిసిసి కార్యదర్శి గొల్ల ఎర్రన్న,చిన్న వాల్గోట్ గ్రామ శాఖ అధ్యక్షుడు రోండ్ల గోవర్ధన్,కాంగ్రెస్ నాయకులు మరియు కార్యకర్తలు పెద్ద ఎత్తున హాజరయ్యారు. చేరిన నాయకులు కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలకు పనిచేస్తామని, ప్రజలకు అందుబాటులో ఉండే నేతృత్వం కాంగ్రెసుదేనని విశ్వాసం వ్యక్తం చేశారు. మండలంలో కాంగ్రెస్ బలం మరింత పెరిగింది. సిరికొండ మండలంలో కాంగ్రెస్ పార్టీకి ఈ చేరికలు బలాన్ని చేకూర్చాయని స్థానిక రాజకీయ వర్గాలు విశ్లేషిస్తున్నాయి. ముందుకొనున్న పంచాయతీ ఎన్నికలకు ఇది కాంగ్రెస్‌కు మానసికంగా పెద్ద బూస్టర్‌గా భావిస్తున్నారు.

